

కటిని చీలుస్తారా..?!

- సతీష్ కుమార్ హత్య జరిగినట్లు కేసు నమోదు
- పోలీస్ గెస్ట్ హౌస్‌లో సీఐడీ డీజీ కీలక సమావేశం
- వైద్య నిపుణులు, డీఐజీ, ఎస్పీతో నాలుగు గంటలు చర్చ
- కోమలి వద్ద అణువణువూ పరిశీలన.. సీన్ రీ కన్‌స్ట్రక్షన్
- గుంతకల్లుకు ప్రత్యేక బృందం.. సీసీ పుటేజీ పరిశీలన

జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు ముమ్మరం





అనంతపురం పోలీసు గెస్ట్‌హౌస్ నుంచి సంఘటనా స్థలానికి బయలుదేరుతున్న సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్, డీఐజీ షిమోషి



రైలు నుంచి బొమ్మను తోసేస్తున్న పోలీసులు



పోలీసు గెస్ట్‌హౌస్ వద్ద వైద్యులు

(ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి)

జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్ అనుమానాస్పద మృతి కేసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు చేరింది మొదలు.. కోమలి వద్ద ఆయన మరణించేదాకా ఏం జరిగిందో తేల్చేందుకు పోలీసు యంత్రాంగం శోధిస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానం పరకామణిలో జరిగిన చోరీ కేసుకు, ఇన్‌స్పెక్టర్ మరణానికి సంబంధం ఉందనే అనుమానాల నేపథ్యంలో సీఐడీ డైరెక్టర్ జనరల్ రవిశంకర్ అయ్యన్నార్ అనంతలో తిష్టవేశారు. దగ్గరుండి దర్యాప్తులో పాల్గొంటున్నారు. సతీష్ కుమార్ మరణంపై ఆయన సోదరుడు హరి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జీఆర్పీ పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. కేసును తాడిపత్రి సబ్ డివిజన్‌కు బదిలీ చేశారు.

తాడిపత్రి మండలం కోమలి సమీపంలోని సంఘటనా స్థలాన్ని డీజీ, డీఐజీ, ఎస్పీ పరిశీలించారు. సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. రైళ్ల నుంచి సతీష్ కుమార్ ఎత్తు, బరువు ఉన్న బొమ్మలను తోసేసి.. సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసేందుకు ప్రయత్నించారు. గుంతకల్లుకు ఓ బృందం వెళ్లి దర్యాప్తు చేసింది. సతీష్ కుమార్ రైల్వే స్టేషన్‌కు చేరింది మొదలు రైలు వెళ్లేదాకా సీసీ పుటేజీ, ఇతర వివరాలను సేకరించింది. ఆ రైలులో సహ ప్రయాణికులు, కాల్ డేటాను సేకరించి.. విశ్లేషిస్తోంది. మొత్తంగా దర్యాప్తు వేగంగా, లోతుగా సాగుతోంది. కానీ ఏ వివరాలనూ బయట పెట్టడం లేదు. 'అన్ని వివరాలను కోర్టుకు నివేదిస్తాం..' అని మాత్రమే పోలీసు అధికారులు అన్నారు.

- అనంతపురంలోని పోలీస్ గెస్ట్ హౌస్‌లో సుమారు నాలుగు గంటలపాటు సీఐడీ డీజీ, డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీష్ తదితరులు సమావేశమయ్యారు. సర్వజన వైద్యశాలలో సీటీ స్కాన్, పోస్టుమార్టం నిర్వహించిన ఆరుగురు వైద్యాధికారులను పిలిపించుకుని వివరాలు తెలుసుకున్నారు. 'హత్య' కోణంలోనే ప్రశ్నలన్నీ వేసినట్లు సమాచారం. సతీష్ కుమార్ పుర్రెతో పాటు ఛాతీభాగంలోని ఎముకలు కూడా దెబ్బతిన్నట్లు తాజాగా తెలిసింది. అవి మినహా శరీరంపై తీవ్ర గాయాలు లేవని సమాచారం. ఇది పూర్తి అయిన తరువాత సీన్ క్షేత్రస్థాయికి మారింది.

ఎస్పీతో చర్చిస్తున్న సీఐడీ డీజీ



ఆ నడిరాత్రి ఓ పోలీసు అధికారి కడపటి ప్రయాణం వెనుక చీకటి కోణం ఏమిటో పోలీసు యంత్రాంగం బయట పెడుతుందనే నమ్మకంతో జనం ఎదురు చూస్తున్నారు..! గుట్టు వీడుతుందా..? అనుమానాలు నివృత్తి అవుతాయా..? తేలాల్సి ఉంది..!

(మెయిన్‌లో)

కసాపురంలో హోమం



ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, ప్రత్యేక అలంకరణలో స్వామి వారి ఉత్సవమూర్తులు

గుంతకల్లుటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో గోపురాల కళశాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించి 16రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం హోమాలు నిర్వహించారు. ఆలయంలో ప్రతిష్ఠ యాగశాల ఉద్వాసన పూజా, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మేడేపల్లి విజయరాజు, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ప్రధాన అర్చకుడు రాఘవచార్యులు, వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి జిల్లా సైన్స్‌ప్రాజెక్టు

- ప్రతిభ చాటిన చీమలవాగుపల్లి జడ్పీహైస్కూల్ విద్యార్థులు



జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన ప్రాజెక్టు చూపుతున్న విద్యార్థులు

అనంతపురం విద్య, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి విద్యార్థులు తమ ప్రతిభతో జాతీయ స్థాయిలో సత్తా చాటారు. స్కూల్ ఇన్నొవేషన్ మారథాన్-2025లో తమ సైన్స్ ప్రాజెక్టును జాతీయ స్థాయిలో వందలోపు నిలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను డీఈఓ ప్రసాద్‌బాబు, సైన్స్ ఆఫీసర్ బాలమురళి శనివారం వెల్లడించారు. స్కూల్ఇన్నొవేషన్-2025లో భాగంగా దేశవ్యాప్తంగా పాఠశాలల నుంచి సైన్స్ ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో ఆహ్వానించారు. ఈక్రమంలో చీమలవాగుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సౌరశక్తి ఆధారిత పిచికారీ యంత్రాన్ని తయారుచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 72వేల ప్రాజెక్టులు వెళ్లాయి. వాటిని నేషనల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఎన్ఐటీ)సంస్థ ప్రొఫెసర్లు పరిశీలించారు. వచ్చిన వాటిలో వంద ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి ప్రకటించారు. అందులో చీమలవాగుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ప్రవల్లిక, కళ్యాణి, ఏడో తరగతి విద్యార్థి షబానా తయారు చేసిన సౌరశక్తి ఆధారిత పిచికారీ యంత్రానికి స్థానం లభించింది. డీజిల్, పెట్రోల్‌లాంటి ఇంధనాలు లేకుండానే సౌరశక్తితో నడిచే ఈ యంత్రంతో పంటలకు తక్కువ ఖర్చుతో రసాయన మందులు పిచికారీ చేసుకోవచ్చని విద్యార్థులు నిరూపించారు. దేశ స్థాయిలో ఘనత చాటిన ఈప్రాజెక్టు తయారు చేసిన విద్యార్థులు, తోడ్పాటు అందించిన అనంతపురం ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు జీఎల్ఎన్ ప్రసాద్‌ను డీఈఓ ప్రసాద్‌బాబు అభినందించారు.

సత్యసాయి సేవలు అమూల్యం

- కొనియాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- మూడో రోజు ఘనంగా శత జయంతి వేడుకలు



పాల్గొన్న భక్తులు, పాటలు పాడుతున్న దానా గెలస్పీ (ఇన్‌సెట్‌లో)



ప్రత్యేక అలంకరణలో మహాసమాధి

పుట్టపర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలో సత్యసాయి శత జయంతి వేడుకలు శనివారం మూడో రోజు ఘనంగా జరిగాయి. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలకంరించి పూజలు చేశారు. విద్యార్థుల వేద పఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సతీ సమేతంగా వేడుకలలో పాల్గొన్నారు. సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. ప్రముఖ ప్రాశ్చాత్య గాయని దానా గెలాక్సీ సత్యసాయి (మిగతా 7వ పేజీలో)

నేను సత్యసాయిని..

- ఉరవకొండలో సత్యసాయిబాబా అవతార ప్రకటన
- పసివయసులోనే మహిమలు చూపిన మహర్షి



బాల సాయిబాబా మందిరం

(వివరాలు 7లో...)

పెద్దమ్మా.. హుండీ భారం నీదే..!



శివపురం పెద్దమ్మ హుండీ ఇదే

శింగనమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపురం పెద్దమ్మ అమ్మవారి ఆలయ హుండీ భద్రతపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. దేవదాయశాఖ పరిధిలో ఉన్న ఈ గుడి తమకే సొంతమని, నిర్వహణ తమకే ఇవ్వాలని ఆలయ పూజారి కుటుంబం 2022లో కోర్టును ఆశ్రయించింది. అయితే హుండీ ఆదాయాన్ని మాత్రం దేవదాయ శాఖ అధికారులు ప్రతి మూడు నెలలకు ఒక సారి లెక్కించేవారు. గత ఏడు నెలలు నుంచి మాత్రం హుండీ ఆదాయాన్ని లెక్కించకుండా పూజారి కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నారు. గత ఏడు నెలల నుంచి హుండీలో పెద్ద మొత్తంలో కానుకలు ఉన్నట్లు భక్తులు చెబుతున్నారు. గుడి జాతీయ రహదారి పక్కనే ఉండటంతో నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. హుండీలో భారీ మొత్తం ఉండటంతో ఎవరైనా చోరీ చేసే అవకాశం ఉందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరుపైనా సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవదాయశాఖ అధికారులు శుక్రవారం బందోబస్తు ఏర్పాటు చేయాలని శింగనమల పోలీస్‌స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. పూజారి కుటుంబం, దేవదాయశాఖ మధ్య జరుగుతున్న వివాదంతో హుండిలోని సొమ్ము చోరీ అయ్యే ప్రమాదం ఉందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలకు శ్రీకారం

- ఇంటర్ డివిజన్ బృందాల ఏర్పాటు

అనంతపురం అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలకు వ్యవసాయ శాఖ యంత్రాంగం శ్రీకారం చుట్టనుంది. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో ఇంటర్ డివిజన్ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి ఏడీఏల నేతృత్వంలో ఇంటర్ డివిజన్ బృందాలను ఏర్పాటు చేస్తూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక డివిజన్ పరిధిలోని ఏడీఏని మరో డివిజన్‌లో తనిఖీలు చేపట్టేలా ఉత్తర్వులు ఇచ్చారు. అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్‌కు గుత్తి డివిజన్‌ను కేటాయించారు. గుత్తి ఏడీఏ వెంకటరాముడుకు అనంతపురం డివిజన్, తాడిపత్రి ఏడీఏ రవికి కళ్యాణదుర్గం డివిజన్, ఉరవకొండ ఏడీఏ సత్యనారాయణకు రాయదుర్గం, కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్పకు ఉరవకొండ, రాయదుర్గం ఏడీఏ పద్మజకు తాడిపత్రి డివిజన్‌ను కేటాయించారు. ఆయా డివిజన్లల్లోని ఏఓలతో కలిసి సోమవారం నుంచి అన్ని దుకాణాల్లో తనిఖీలు చేపట్టి, నిబంధనల అతిక్రమణపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోజు వారిగా తనిఖీలకు సంబంధించి వివరాలను జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారు.

నేటితరానికి సంప్రదాయాలను పరిచయం చేయాలి

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత
- ఘనంగా కార్తీక వనమహోత్సవం



ఉసిరి చెట్టుకు మహిళలతో కలిసి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కనుమరుగవుతున్న సంస్కృతీ, సంప్రదాయాలను నేటితరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని పండమేరు వెంకటరమణస్వామి దేవస్థానం వద్ద శనివారం కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఆమె ఆలయం వద్ద మహిళలతో కలిసి ఉసిరిచెట్టు నాటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్తీక మాసంలో ఇలాంటి వన మహోత్సవాలు నిర్వహించడంతో మరోసారి సంప్రదాయాలను గుర్తు చేసుకున్నట్లయిందన్నారు. వన మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా గ్రామాల్లో ఐక్యత పెరుగుతుందన్నారు. మనకున్న ఇబ్బందులన్నీ మరిచిపోయి అంతా ఒకచోట చేరి వన భోజనం చేస్తే మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం మహిళలతో కలిసి ఆటల పోటీల్లో పాల్గొన్నారు. వంటలు తయారీ చేసి సహపంక్తి భోజనం చేశారు. చివరగా ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఎమ్మెల్యే పరిటాల సునీతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ రామ్మోహన్ రావు, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారితో పాటు మార్కెట్ యార్డు సభ్యులు, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



బ్రహ్మకమలం

తాడిపత్రి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్ మొదటి రోడ్డులో నివాసం ఉంటున్న ఆంద్ర వెంకటనాయుడు ఇంటిలో శనివారం బ్రహ్మకమలం వికసించింది. కార్తీక మాసంలో మాత్రమే ఈ మొక్క పుష్పిస్తుందని యజమాని వెంకటనాయుడు తెలిపారు. రెండేళ్ల కిందట బెంగళూరులో ఈమొక్కను తెచ్చానని, అప్పట్లో ఇది బ్రహ్మకమలం మొక్క అని తనకు తెలియదన్నారు. ఈపుష్పం ఉత్తరాఖండ్ రాష్ట్రీయ పుష్పంగా ఉందని ఆయన తెలిపారు.

టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- ఎయిడెడ్‌స్కూళ్లలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం విద్య, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిడెడ్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి జిల్లా విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. వివరాలను డీఈఓ ప్రసాద్‌బాబు శనివారం వెల్లడించారు. అనంతపురంలోని సెయింట్‌మేరీ బాలికల ఎయిడెడ్ హైస్కూల్, ఆర్‌సీఎం ఎయిడెడ్ ప్రైమరీ స్కూల్‌లో ఈ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఈపోస్టులకు మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. సెయింట్‌మేరీ స్కూల్‌లో ఎస్ఏ బయాలజీ01, ఎస్ఏ తెలుగు 01, ఎల్‌పీటీ తెలుగు 01, ఎల్‌పీటీ హిందీ01, పీఈటీ01చొప్పున పోస్టులు ఉన్నాయని, ఇవన్నీ ఓపెన్ కేటగిరీలోనే ఉన్నాయని డీఈఓ తెలిపారు. అలాగే ఆర్‌సీఎం ఎయిడెడ్ ప్రైమరీస్కూల్‌లో ఎస్‌జీటీపోస్టులు 05 ఉండగా, అందులో ఎస్సీలకు02, ఎస్టీలకు 01, ఓసీలకు 02 పోస్టులు ఉన్నాయన్నారు. ఈపోస్టులకు ఇప్పటివరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఉన్నా ఆన్‌లైన్‌లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈనెల 25 నాటికి డీఈఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు ఏపీఓ మంజునాథ్, నంబర్ 94949 303343ను సంప్రదించి తెలుసుకోవాలని సూచించారు.

కిడ్నీ రాకెట్‌లో కదిరి వాసి

- డాక్టర్, టెక్నీషియన్లే సూత్రధారులు

7

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

7

తాడోపేడో తేల్చుకుందాం.. రండి..!

- శ్రీభాగ్ ఒప్పందంపై కుంచం

చిరస్మరణీయులు బిర్సాముండా: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గిరిజన యోధుడు బిర్సాముండా చరిత్రలో చిరస్మరణీయులుగా నిలుస్తారని కలెక్టర్ ఆనంద్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జన్ జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్యసమరయోధులు బిర్సాముండా 150వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు, డీఆర్ఓ మలోల, గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ సభ్యులు రమేష్‌నాయక్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సాకే చిరంజీవి, బంజారా సంక్షేమ సమితి సీనియర్ నాయకులు కేశవ్‌నాయక్, ఉమామహేశ్వరి, పలు శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. ఈసందర్భంగా బిర్సాముండా తెగువను కలెక్టర్ కొనియాడారు. ఆయన సహసాన్ని స్మరించుకుంటూ భారత ప్రభుత్వం నవంబరు 15న జన్ జాతీయ గౌరవ్ దివస్‌గా ప్రకటించిందన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. జిల్లాలో ఈనెల 1 నుంచి నేటి వరకు జయంతి కార్యక్రమాల్లో భాగంగా ఆయా పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు క్రీడల పోటీలను నిర్వహించామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు తెలిపారు. అనంతరం పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు బహుమతి ప్రదానం చేశారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆనంద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని తెలిపారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కోరారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీకి సంబంధించిన స్లిప్పును వెంట తీసుకురావాలని సూచించారు.

నేను.. సత్యసాయిని..!

ఉరవకొండలో సత్యసాయిబాబా అవతార ప్రకటన
పసివయసులోనే మహిమలు చూపిన మహర్షి


ఉరవకొండలోని బాల సాయిబాబా మందిరం

ఉరవకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి ప్రేమతత్వాన్ని బోధించిన సత్యసాయిబాబా ఉరవకొండలో తన అవతార ప్రకటన చేశారు. తల్లిదండ్రులు పెట్టిన సత్యనారాయణరాజు పేరును కాదని, తన 14వ ఏట సత్యసాయిగా ప్రకటించుకున్నారు. సత్యసాయిబాబా 1926, నవంబరు 23న పుట్టపర్తిలో వెంకమరాజు, ఈశ్వరమ్మ దంపతులకు జన్మించారు. బాబా సోదరుడు శేషమరాజు ఉరవకొండలో కరిబసవస్వామి, బోర్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తుండటంతో విద్యాభ్యాసం కోసం ఆయన వచ్చాడు. విద్యార్థి దశలోనే అనేక మహిమలను చూపిస్తూ, తనతోటి విద్యార్థులనే కాకుండా, ఉపాధ్యాయులను అబ్బురపరిచేవారు. ఆ సమయంలోనే మౌనంగా ఉండటం, తనకు ఇష్టమైనప్పుడు పాఠశాల సమీపంలోని ఆబ్కారీ ఇన్‌స్పెక్టర్ బంగ్లా ఆవరణలోని పెద్ద రాతి గుండుపై కూర్చునే వారు. 1940, అక్టోబరు, 20న పాఠశాలకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాగానే చేతిలోని పుస్తకాల సంచిని విసిరేసి, 'మాయ వీడినది, నేను సత్యనారాయణను కాదు, సత్యసాయి బాబాను, నేను నా కర్తవ్యాన్ని నిర్వహించాల్సి ఉంది. నన్ను నా భక్తులు పిలుస్తున్నారు. నేను వెళ్తున్నాను' అంటూ అబ్కారీ ఇన్‌స్పెక్టర్ బంగ్లా ఆవరణకు వెళ్లి కూర్చుండి పోయారు. దీన్ని చూసి శేషమరాజు భార్య ఆశ్చర్యంతో వారించేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. 14 ఏళ్ల బాలుడు ధ్యాన ముద్రలో గుండుపై కూర్చున్నాడని ఉరవకొండ, చుట్టు పక్కల ప్రజలకు తెలిసి అక్కడికి వచ్చారు. ఆ తేజోమూర్తిని చూసిన పిమ్మట భక్తులుగా మారారు. తొలి సారిగా మనసాభజరే గురుచరణం అన్న భజన గీతాన్ని భక్తులతో బాబా ఆలపింపజేసినట్లు స్థానికులు నేటికీ చెబుతున్నారు. సత్యనారాయణ రాజు అవతార ప్రకటన విషయాన్ని శేషమరాజు ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు ఉరవకొండకు చేరుకుని, బాబాను అతికష్టం మీద పుట్టపర్తికి తీసుకెళ్లారు. ఇలా బాబాతో కొన్నేళ్ల అనుబంధాన్ని ఉరవకొండ మూటగట్టుకుంది. అలా బాబా ప్రపంచానికి తెలిసిన తర్వాత 2003లో ఉరవకొండలో సత్యసాయి భజన మందిరాన్ని నిర్మించారు. దీనికి సంబంధించి బాబా చేతుల మీదుగా శిలాఫలకాన్ని ఆవిష్కరింపజేశారు. అలాగే సత్యసాయి బాబా ధ్యానం చేసిన గుండుకు మందిరాన్ని కట్టి , బాల సాయి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్య పూజలతో పాటు ప్రతి ఏటా అవతార ప్రకటన రోజు రథోత్సవాన్ని నిర్వహిస్తారు. జయంతి వేడుకలను ఆరాధనలను ఘనంగా నిర్వహిస్తున్నారు.




సత్యసాయిబాబా చదివిన తరగతి గది



విడదీయరాని బంధం..

సత్యసాయిబాబాకి ఉరవకొండతో విడదీయరాని అనుబంధం ఉంది. ఉరవకొండలోనే అవతార ప్రకటన చేసినా, తల్లిదండ్రుల కోరిక మేరకు పుట్టపర్తికి వెళ్లి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. మానవతా విలువలతో కూడిన బోధనలు ప్రబోధించారు. అవతార ప్రకటన రోజు ప్రతి ఏటా రథోత్సవం నిర్వహిస్తున్నాం.

- రామాంజనేయులు, సత్యసాయి సమితి కన్వీనర్

ఎన్నో గ్రామాలకు తాగునీరు

సత్యసాయి వాటర్ ప్రాజెక్టు ద్వారా ఎన్నో గ్రామాలకు తాగు నీరు అందించి, శాశ్వత పరిష్కారం చూపారు. సత్యసాయి బాబా అతార ప్రకటన చేసిన రాతిగుండుపై బాల సాయి విగ్రహాన్ని ప్రతిష్ఠించాం. ప్రతి ఏటా సత్యసాయి జయంతికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నాం. సత్యసాయి బాబా చేత శిలాఫలకాన్ని ఆవిష్కరించి భజన మందిరాన్ని నిర్మించాం.

- సాగర్, భక్తుడు



సత్యసాయి సేవలు అమూల్యం


మహాసమాధికి ప్రణమిల్లిన జస్టిస్ బీఆర్ గవాయ్


జస్టిస్ బీఆర్ గవాయ్‌ను సన్మానిస్తున్న రత్నాకర్


సత్యసాయి మహాసమాధికి ప్రణమిల్లిన కేంద్రమంత్రి పీయూష్ గోయల్

(5వ పేజీ తరువాయి)

ప్రేమతత్వంపై సంగీత, గాన కచేరి నిర్వహించారు. అనంతరం విద్యార్థులు భక్తిగీతాలాపన చేశారు.

వెలకట్టలేని సేవలు..

భగవాన్ సత్యసాయి వెలకట్టలేని సేవలతో ఆదర్శంగా నిలిచారని కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఆయన బాటలో పయనించాలని భక్తులకు పిలుపునిచ్చారు. శత జయంతి వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. భక్తులనుద్దేశించి ప్రసంగించారు. కరువు ప్రాంత దాహార్తిని తీర్చిన మహనీయుడు సత్యసాయి అని కొనియాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ద్వారా 28 వేల గుండె శస్త్ర చికిత్సలు, 37 వేల న్యూరో సర్జరీలు, 18 లక్షల మందికి వైద్య సేవలు అందించారని అన్నారు. ప్రశాంతి నిలయం నిజమైన శాంతి నిలయం అని కొనియాడారు. సత్యసాయి బోధించినట్లుగా ఆయన జీవితమే ఆయన సందేశమని అన్నారు. 2016లో తాను తొలిసారి మహాసమాధిని దర్శించుకున్నానని అన్నారు. సత్యసాయి సేవలను ట్రస్టు మరింత పారదర్శకంగా కొనసాగించడం అభినందనీయమని అన్నారు.

సత్యసాయి అందరివాడు..

సత్యసాయి అందరివాడని, మనవెంటే ఉన్నాడని సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే అన్నారు. ఒక్క భారత్‌కే గాక ప్రపంచానికి సేవలు, బోధనలు, ప్రేమతత్వాన్ని అందించారని అన్నారు. తాము సత్యసాయి మార్గంలో పయనిస్తూ సేవలందిస్తున్నామని అన్నారు. వేడుకలకు హాజరైన ప్రముఖులను సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఘనంగా సన్మానించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు నారాయణ సేవ అందించారు. వేలాది మంది భక్తులతో పుట్టపర్తి కళకళలాడింది.

ఏఈఈలకు ప్రమోషన్

అనంతపురం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ పరిధిలోని పలువురు ఏఈఈలకు డీఈఈలుగా ఉద్యోగోన్నతి లభించింది. ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రూరల్ ఏఈఈగా పనిచేస్తున్న సోమశేఖర్‌కు డీఈఈగా ఉద్యోగోన్నతి కల్పించి కళ్యాణదుర్గంకు బదిలీ చేశారు. ఎంఅండ్‌పీలో ఏఈఈగా పనిచేస్తున్న చంద్రమోహన్‌కు డీఈఈగా కళ్యాణదుర్గం టౌన్‌కు బదిలీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో మరో ఇద్దరు ఏఈఈలకు ఉద్యోగోన్నతి కల్పించారు. మదనమోహన్, శీనా నాయక్ డీఈఈలుగా ఉద్యోగోన్నతి పొందారు.

మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశం

ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో డిగ్రీ ఆ నర్స్ కోర్సుల్లో ప్రవేశానికి కళాశాల హెల్ప్ డె స్కను సంప్రదించాలని కళాశాల ఇన్‌చార్జ్ ప్రి న్సిపాల్ సరిత తెలిపారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రోబయాలజీ, జువాలజీ, బీబీఏ, బీబీఎం బిజినెస్ అనలిటిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం అకౌంటింగ్ వంటి సబ్జెక్టుల్లో మొదటి సంవత్సరానికి మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 8297531541, 996664 4080 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

ముగ్గురికి గాయాలు


దుకాణంలోకి దూసుకెళ్లిన ఇన్నోవా

నంబులపూలకుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి కాంప్లెక్సులో ఉన్న దుకాణాల మీదుగా శనివారం ఓ కారు దూసుకెళ్లడంతో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు మండలకేంద్రానికి సమీపంలోని ఉన్న సోలార్ ప్రాజెక్టులో పని చేస్తున్న ఓ ఉద్యోగి విధులు ముగించుకుని తన కారును డ్రైవ్ చేసుకుంటూ కదిరికి బయల్దేరాడు. బస్టాండ్ కూడలిలోకి రాగానే కారు అదుపుతప్పి మల్లికార్జునస్వామి కాంప్లెక్సులో ఉన్న రామయ్య, నజీర్, ఖాదర్‌బాషాలకు చెందిన కూరగాయల దుకాణంలోకి దూసుకెళ్లింది. దీంతో కూరగాయల బుట్టలు నుజ్జునుజ్జుకాగా, దుకాణాల ముందు నిలుచుకుని ఉన్న మంజునాథ్, టి. శంకర్, పి.శంకర్ గాయపడ్డారు. మంజునాథ్, టి. శంకర్ ఎన్పీకుంట వాసుకాగా, పి.శంకర్ అన్నమయ్యజిల్లాలోని కొట్టాలకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అలాగే దుకాణాల వద్ద పార్క్ చేసిన నాలుగు వాహనాలు దెబ్బతిన్నట్లు చెప్పారు. ప్రమాదంలో గాయపడిన వారిని 108 ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై విచారించి, కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ కిషోర్‌రెడ్డి పరిశీలించారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

ఓబుళదేవరచెరువు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపల్లి, నారప్పగారిపల్లిలో శనివారం జరిగిన కుక్కలదాడిలో ఇద్దరు గాయపడ్డారు. రామిరెడ్డిపల్లికి చెందిన వృద్ధురాలు మంతముతక మస్తానమ్మ తన వ్యవసాయ పొలానికి వెళ్తుండగా కుక్కలు దాడి చేశాయన్నారు. ఈ దాడిలో ఆమె ఎడమ కాలికి తీవ్ర రక్తగాయాలు కాగా, కుడి చెవికి గాట్లు పడ్డాయి. స్థానికులు ఆమెను కుక్కల దాడి నుంచి కాపాడి108లో కదిరి ఆస్పత్రికి తరలించారు. మరో ఘటనలో కూలి పనుల కోసం నారప్పగారిపల్లికి వచ్చిన వంచిరెడ్డిపల్లికి చెందిన ఆదినారాయణపై కూడా కుక్క దాడి చేసింది. కాలికి తీవ్ర గాయం కావడంతో బాధితుడిని స్థానికులు ఓడీసీ ఆస్పత్రికి తరలించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి

పుట్టపర్తిరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు జీఎం శేఖర్ అధ్యక్షతన జిల్లా పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దయాకర్ రెడ్డి పార్టీ నిర్మాణం, విస్తరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు బూత్‌కమిటీలను, శక్తికేంద్రాలు, మండలకమిటీలను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. వీటి ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ-అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లాఇన్చార్జి బాలకృష్ణయాదవ్, సీనియర్ నాయకులు రమేష్‌రెడ్డి, తలుపుల గంగాధర్, జిల్లాప్రధాన కార్యదర్శి హరికృష్ణ, అమరదేవేంద్ర, జ్యోతిప్రసాద్, సురేంద్ర బాబు, కొండమరాజు, పట్టణ అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి

రాజకీయం కోసమే విమర్శలు

వైసీపీపై జనసేన నేత చిలకం ధ్వజం



ధర్మవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగిపోయిన వైద్య కళాశాలల నిర్మాణం విషయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీరును రాజకీయం చేస్తూ విమర్శలు చేస్తున్నారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడచూసినా మాజీమంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి భూబాగోతాలే కనిపిస్తున్నాయన్నారు. వీటిని బయటపెడు తుంటే జీర్ణించుకోలేని కార్యకర్తలు, పెద్దిరెడ్డి అనుచరులు పవన్‌కల్యాణ్, జనసేన పార్టీపై నోరుపారేసుకుంటున్నారని మండిపడ్డారు. పెద్దిరెడ్డి కుటుంబానికి 45.80ఎకరాలు భూమి ఉండేది. వెబ్‌ల్యాండ్‌లో వచ్చేసరికి 77.54ఎకరాలు ఏ విధంగా పెరిగిందని ఆయన ప్రశ్నించారు. 295, 296 సర్వేనెంబర్లలో గతంలో కన్నా ప్రస్తుతం ఏ విధంగా విస్తీర్ణం పెరిగిందని ప్రశ్నించారు. 40ఎకరాలు కబ్జాకు గురైనట్లు అధికారుల సర్వేలో నిర్ధారణ అయిందన్నారు. పెద్దిరెడ్డిలో నిజాయతీ సీబీఐ విచారణ కోరి నిజాయతీని నిరూపించుకోవాలన్నారు. తిరుమలకు సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగినట్లు సిట్ నిర్ధారించినట్లు తెలిపారు. గతంలో తిరుమలలో పని చేసిన ఓ పోలీస్ అధికారి అనుమానాస్పద మృతిపై నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు. జగన్‌రెడ్డి వద్ద మెప్పుపొందేందుకు పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. కేతిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఉనికిని కాపాడుకోవడం కోసమే చంద్రబాబు, పవన్‌కల్యాన్‌పై విమర్శలు గుప్పిస్తున్నారన్నారు.

చీనీ టన్ను రూ.18వేలు

అనంతపురంరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 25 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు తెలిపారు.

డాక్టర్, టెక్నీషియన్లే సూత్రధారులు

- కిడ్నీ రాకెట్ కేసులో వీడిన మిస్టరీ
- డీసీహెచ్ఎస్ సహా ఆరుగురి అరెస్టు
- 6 సెల్‌ఫోన్లు స్వాధీనం.. డాక్టర్ పరారీ
- మరో ఎనిమిది మంది పాత్ర గుర్తింపు
- 'గ్లోబల్'లో ఒకేరోజు ఇద్దరికి కిడ్నీ మార్పిడి
- విశాఖకు చెందిన మహిళ యమున మృతి
- వివరాలు వెల్లడించిన మదనపల్లె డీఎస్పీ


కిడ్నీ మార్పిడి కేసులో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మదనపల్లె డీఎస్పీ మహేందర్, ఇతర పోలీసులు. చిత్రంలో నిందితులు(ముసుగు)

మదనపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో వెలుగుచూసిన కిడ్నీ రాకెట్ కేసులో మిస్టరీ వీడింది. డయాలసిస్ కేంద్రాల్లో పనిచేసే ఇద్దరు మేనేజర్లు, విశాఖ ప్రాంతానికి చెందిన ఇద్దరు మధ్యవర్తులతో అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్, బెంగళూరుకు చెందిన కిడ్నీ మార్పిడి డాక్టర్లు దీనిలో కీలకపాత్ర పోషించినట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఎనిమిది మంది నిందితులను గుర్తించారు. ఈ కేసులో కీలకంగా మారిన బెంగళూరుకు చెందిన వైద్యుడు పరారీలో ఉన్నారు. ఈ కిడ్నీ రాకెట్ ముఠా కేసుకు సంబంధించిన వివరాలను మదనపల్లె డీఎస్పీ మహేందర్.. శనివారం మీడియాకు వివరించారు.

డబ్బు ఆశ చూపి..

విశాఖపట్నానికి చెందిన ఎస్. యమున(29) ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ విషయాన్ని గ్రహించిన అదే ప్రాంతానికి చెందిన పిల్లి పద్మ, సత్యలు కిడ్నీ ఇస్తే డబ్బులు వస్తాయని ఆశ చూపారు. తాను కూడా ఇప్పటికే కిడ్నీ విక్రయించినట్లు పద్మ తెలిపింది. ఇదే విషయాన్ని యమునతో సహజీవనం చేస్తున్న సూరిబాబుకు కూడా చెప్పారు. ఈ ముగ్గురూ కలసి యమున కిడ్నీ ఇచ్చేలా ఒప్పించారు. అనంతరం.. మదనపల్లె, సత్యసాయి జిల్లా కదిరి డయాలసిస్ కేంద్రాల్లో మేనేజర్లుగా పనిచేస్తున్న బాల రంగడు అలియాస్ బాలు, మోహరాజ్‌లను పద్మ, సత్య సంప్రదించారు. వారి సూచన మేరకు యమునను మదనపల్లెకు తీసుకొచ్చి గ్లోబల్ ఆసుపత్రి యజమాని, డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె. ఆంజనేయులును సంప్రదించారు. ఈ నెల 9న గ్లోబల్ ఆసుపత్రిలో యమునను చేర్చారు. అప్పటికే బెంగళూరు నుంచి వచ్చిన కిడ్నీ ఆపరేషన్ స్పెషలిస్టు, ఇద్దరు సాంకేతిక సిబ్బందితో కలిసి గ్లోబల్ ఆసుపత్రిలో ఒక డోనర్ నుంచి కిడ్నీ తొలగించి, రిసీవర్‌కు ఆపరేషన్ చేశారు. అదే రోజురాత్రి యమున నుంచి కిడ్నీ తొలగించి మరో రిసీవర్‌కు సర్జరీ చేశారు. అంతవరకు బాగానే ఉన్నా.. తర్వాత యమున ఆరోగ్య పరిస్థితి విషమించడంతో పదో తేదీ ఉదయం ఆమె మృతి చెందారు. దీంతో కంగారు పడిన కిడ్నీ ముఠా బృందం యమున మృతదేహాన్ని హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ పోస్టుమార్టానికి సరైన వసతులు లేకపోవడంతో తిరిగి తిరుపతి రుయాకు తరలించి ప్రక్రియ పూర్తిచేసి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

ఇతర రాష్ట్రాలకు బృందాలు

యమున తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. గ్లోబల్ ఆసుపత్రి యజమాని డాక్టర్ కె. ఆంజనేయులు, డయాలసిస్ కేంద్రాల మేనేజర్లు బాలరంగడు, మోహరాజ్, మధ్యవర్తులు పిల్లి పద్మ, సత్య సహా యమున వెంట వచ్చిన సూరిబాబులను అరెస్టు చేశారు. ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన బెంగళూరు వైద్యుడు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఇదే కేసులో మరో ఎనిమిది నిందితులను గుర్తించామని, వీరిని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. వీరిలో మొదటి రిసీవర్‌కు కిడ్నీ ఇచ్చిన వ్యక్తి, ఇద్దరు కిడ్నీ రిసీవర్లు, బెంగళూరు డాక్టర్‌కు సహకరించిన ఇద్దరు టెక్నీషియన్లు, యమున మృతదేహాన్ని తిరుపతి, మదనపల్లెకు తరలించిన అంబులెన్స్ డ్రైవర్‌తో సహా మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ కేసును ఛేదించడానికి 4 ప్రత్యేక బృందాలను నియమించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ బృందాలు ఏపీ, గోవా, కర్ణాటక, తెలంగాణలో నిందితులకోసం గాలిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కిడ్నీ ఆపరేషన్లు చేస్తున్న ఆసుపత్రిపై మరింత లోతుగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వివరించారు.

ఏఐ ద్వారా డ్రోన్ సర్వే


ఏఐ సాంకేతికతతో డ్రోన్ సర్వే నిర్వహిస్తున్న శాస్త్రవేత్తల బృందం

లేపాక్షి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో కర్నూలుకు చెందిన ఐఐఐటీడీఎమ్ ప్రొఫెసర్లు ఏఐ టెక్నాలజీ ద్వారా డ్రోన్ సర్వే చేపట్టారు. ఈ సంస్థ ప్రొఫెసర్లు గత పదేళ్ల వర్షపాతం, వ్యవసాయ సంబంధిత డేటాను విశ్లేషించి, ప్రస్తుత పరిస్థితులతో పోల్చి భవిష్యత్తులో సంభవించే కరువు అవకాశాలను అంచనా వేయడానికి శాస్త్రీయ పరిశోధనలను ప్రారంభించారు. ఈ అధ్యాయనం ఆధునిక డ్రోన్ సాంకేతికత ఆధారంగా నిర్వహిస్తున్నారు. ఈ పరిశోధనలో భాగంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ నరేషబాబు ఆధ్వర్యంలో ఈ బృందం లేపాక్షి మండలంలో డ్రోన్ ఆధారిత సర్వే నిర్వహించింది. వ్యవసాయ భూభాగం, నీటి వనరులు పంటల పరిస్థితులు వంటి కీలక అంశాలపై డ్రోన్‌లు సేకరించిన డేటాను కరువు సూచికల విశ్లేషణకు ఉపయోగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక వ్యవసాయాధికారి శ్రీలత హాజరై వీరికి సహాయ సహకారాలు అందించారు.
సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి, నాగినాయనిపల్లి గ్రామంలో శనివారం కర్నూలుకు చెందిన ఐఐఐటీ డీఎమ్ ప్రొఫెసర్ల బృందం డ్రోన్ సర్వే నిర్వహించింది. ఏఓ విజయభారతి మాట్లాడుతూ ప్రొఫెసర్లు నరేష్‌బాబు, సత్తిబాబు, కృష్ణానాయక్‌ల బృందం శ్రీసత్యసాయి జిల్లాలో మధ్యస్థ కరువు మండలాలను గుర్తించేందుకు పర్యటించినట్లు తెలిపారు. వారు ఆయా గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించి ఏఐ టెక్నాలజీ ద్వారా డ్రోన్లను ఉపయోగించి కరువు పంటల పరిస్థితులను విశదీకరించినట్లు తెలిపారు. కరువు ప్రాంత పంటలను అధ్యాయనం చేయడానికి వచ్చిన బృందం తాము సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ అల్లైఖ్య, వీఐఏ, వీఎస్ఏ, రైతులు పాల్గొన్నారు.

తాడోపేడో తేల్చుకుందాం.. రండి..!

శ్రీభాగ్ ఒప్పందంపై కుంచం


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కుంచం

అనంతపురం టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీభాగ్ ఒప్పందం చరిత్రలో కలుక్కుమంటున్న జ్ఞాపకం అని, ఒప్పందంపై తాడోపేడో తేల్చుకుందామని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. పన్నెండు జిల్లాలను కలిపి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో కర్నూలు అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించే రాయలసీమ రాష్ట్ర సమితి సమావేశానికి అన్ని పార్టీల నాయకులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. నగరంలోని ఆ సమితి జిల్లా కార్యాలయంలో రాష్ట్ర సమితి సమావేశ బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఎనిమిది దశాబ్దాలలో శ్రీభాగ్ ఒప్పందంలోని ఏ ఒక్క అంశమూ అమలు కాలేదని అన్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నపుడు తెలుగు వాళ్లని తమిళులు వెనక్కు నెట్టేస్తున్నారనే ఆందోళన ఉండేదని అన్నారు. ఆ కారణంగానే ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలనే భావన పెరిగిందని అన్నారు. ఇప్పటికైనా రాయలసీమ వాసులు చైతన్యం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర సాధనకోసం నిర్వహిస్తున్న ఈ సమావేశానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఓబుల్‌రెడ్డి, సోమసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.44

అనంతపురం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.44తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. శనివారం మార్కెట్‌కు 2,100 టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. టమోటా కిలో కనిష్ఠ ధర రూ.24, సరసరి ధర రూ.30తో విక్రయాలు జరిగాయన్నారు.

న్యూస్ బాక్స్

శాస్త్రోక్తంగా సహస్ర లింగార్చన



సహస్ర లింగార్చన చేస్తున్న అప్పాస్వామి బృందం

అనంతపురం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శివకోటి ఆలయంలో నిర్వహిస్తున్న మహారుద్ర-సహస్ర శంఖాభిషేక వేడుకల్లో భాగంగా రెండో రోజు శనివారం సహస్ర లింగార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో శివకామేశ్వర స్వామి, శివకామేశ్వరిమాతల మూలవిగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో శివకోటి పీఠం వ్యవస్థాపకుడు అప్పాస్వామి నేతృత్వంలో 1008 రుద్రాక్షలతో శివలింగాకృతిని రూపొందించి, వేదమంత్రోచ్చారణల నడుమ సహస్ర లింగార్చన, లక్షబిళ్వార్చన చేశారు. కార్యక్రమంలో శివకోటి ఆలయ ట్రస్టు సభ్యులు అమర్నాథ్, నరసింహం, ప్రధానార్చకుడు సుబ్రహ్మణ్యం, అనిల్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

రామగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కురుబల ఆరాధ్యదైవమైన భక్తకనకదాస జయంతిని మండలంలోని శేషంపల్లిలో శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కురుబలు ఇంటింటి నుంచి మహిళలు కలశాలు, బోనాలతో ఊరేగింపుగా వచ్చి కనకదాస విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేసి వాటిని సమర్పించారు. గురవయ్యలకు పాలు పోయించే కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించి నృత్యాలతో అలరించారు. గ్రామానికి చెందిన పలువురు కురుబసంఘం నాయకులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం విద్య, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు రెండో రోజు కొనసాగాయి. శనివారం జిల్లాగ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. డీఆర్‌ఓ మలోల ముఖ్యఅతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించి తిలకించారు. గ్రంథాలయాలు సామాజిక జన చైతన్యానికి ఉపయోగపడుతాయని, వాటిని కాపాడుకోవాలని డీఆర్‌ఓ కోరారు. గ్రంథాలయ సెక్రటరీ రమ, డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవింద్ పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆక్రమణల తొలగింపు



మర్తాడులో ఎస్సీ శ్మశాన వాటికలో తొలగించిన ఆక్రమణలు

గార్లదిన్నె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు గ్రామంలో ఎస్సీ శ్మశాన వాటిలో అక్రమంగా నిర్మించిన్న కట్టడాలను అధికారులు తొలగించారు. ఇటీవల ఆక్రమణల్లో ఎస్సీ శ్మశాన వాటిక అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన రెవెన్యూ అధికారులు శ్మశాన వాటికను సర్వే చేయించారు. స్థలాన్ని ఆక్రమించిన వారికి నోటీసులు ఇచ్చారు. దీంతో వారు ఆక్రమణలు తొలగించారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కనగానపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తగరకుంట గ్రామం నుంచి కట్టకింద తండా వరకు రూ.85 లక్షల వ్యయంతో తారురోడ్డు నిర్మాణానికి డీసీఎంఎస్, మార్కెట్ యార్డ్ చైర్మన్లు నెట్టెం వెంకటేష్, సుధాకర్ చౌదరి, కన్వీనర్ యాతం పోతలయ్యలు శనివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మారుమూల ప్రాంతాలకు కూడా ఎమ్మెల్యే పరిటాల సునీత సీసీరోడ్లు, బీటీరోడ్లు వేయిస్తున్నారన్నారు. డీఈ లక్ష్మీనారాయణ, జేఈ దినేష్‌కుమార్, సర్పంచ్ మాధవరాజు, బోదుల రామంజి పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు

రాప్తాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రైతుల పొలాల్లో మార్కెట్ యార్డు నిధులు వెచ్చించి రహదారులకు మరమ్మతులు చేసేందుకు పాలకవర్గ సభ్యులు తీర్మానించారు. రాప్తాడు మార్కెట్ యార్డు కార్యాలయంలో చైర్మన్ బోయపాటి సుధాకర్ చౌదరి అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. మెదటగా రైతులు తాము పండించిన పంటలను మార్కెట్‌కు తెచ్చేందుకు పడుతున్న ఇబ్బందులను చూసి రహదారులకు మరమ్మతులు చేస్తామని చైర్మన్ తెలిపారు. సెక్రటరీ రూప్‌కుమార్, వైస్ చైర్మన్ గంగులకుంట కిష్టయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కియ షోరూంలో ఓనర్షిప్ క్యాంప్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీఈఓ ఆదిత్య మాచాని

అనంతపురంరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కలపల్లి క్రాస్ సమీపం ఎంజీబీ కియ షోరూంలో ఓనర్షిప్ క్యాంప్‌ను శనివారం ఏర్పాటు చేశారు. కస్టమర్లు, ఎంజీబీ కియ సీఈఓ ఆదిత్య మాచాని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి 23వతేదీ వరకు క్యాంప్ ఉంటుందన్నారు. ఇదివరకు కారు ఉన్న కస్టమర్లు కొత్త కారు కొనాలంటే ఉచిత కారు ఎవాల్యూయేషన్, ఎక్స్ఛేంజ్ బోనస్ కూడా ఉంటుందన్నారు. ప్రస్తుతం కస్టమర్లకు 36పాయింట్ల హెల్త్ చెకప్ ఉచితంగా చేస్తున్నామన్నారు. కియ జెన్యూస్ యాక్ససరీస్ మీద 5 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు కార్ కేర్ సర్వీసుల మీద, రోడ్ సైడ్ అసిస్టెంట్ అండ్ ఎక్స్టెండెడ్ వారంటీ మీద కూడా డిస్కౌంట్, ఉచిత బాడీ కార్ వాష్ ఉంటుందన్నారు.

కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లగా నగర వాసులు ఎదుర్కొంటున్న కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం అనిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్ అని... ఇచ్చిన హామీ మేరకు ఆరు నెలల్లోనే ఏబీసీ సెంటర్ ప్రారంభించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏఎంసీ కమిషనర్ బాలస్వామితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కుక్కలకు ఆపరేషన్ పేరుతో రూ.60లక్షలు నిధులు దోచుకునేందుకు కుట్ర చేశారన్నారు. 4700కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు చేసినట్లుగా రికార్డులు సృష్టించి...క్షేత్రస్థాయిలో ఒక్క కుక్కకు కూడా చేయలేదని విమర్శించారు. రూ.15లక్షలు బిల్లులు చేసుకున్నారని, మిగిలిన మొత్తాన్ని కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిపివేశామన్నారు. ఇప్పుడు అనుభవం, పారదర్శకత గల హర్యాణాకు చెందిన ఏజెన్సీకి ఏబీసీ ఆపరేషన్ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. నగరంలోని ప్రతి కుక్క రికార్డు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఆపరేషన్ తరువాత అందించే ఆహారం, చెవికి ట్యాగ్ వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ పావని, ఎంహెచ్‌ఓ నరసింహులు, ఈఈ షాకీర్, కార్పొరేటర్లల జనబలం బాబా, చలివెందుల బాలాంజినేయులు, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, తెలుగుయువత సుధాకర్ యాదవ్, ఫిరోజ్‌అహ్మద్, తేజస్విని, హరి, నెట్టెం బాలకృష్ణ, ఓంకార్ రెడ్డి, ఇస్మాయిల్, శోభ, అయేషా పాల్గొన్నారు.

ప్రాథమిక దశ నుంచే పరిశుభ్రతపై అవగాహన పెంచాలి

ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంపొందించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక 46వ డివిజన్ నాలుగో రోడ్డులో ఉన్న నేతాజీ సుభాష్‌చంద్రబోస్ పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ బాలస్వామితో కలిసి ఎమ్మెల్యే పరిసరాలను శుభ్రం చేశారు. మొదట పాఠశాలలో ఏర్పాటు చేసిన పరిశుభ్రత థీమ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే..ప్రతి ఒక్కరూ చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి వృథాను అరికట్టడంపై అవగాహన కల్పించారు. వార్డుస్థాయి నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, సీఎం వరకు ఈ కార్యక్రమంలో ప్రజలతో కలిసి భాగస్వాములవుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. నగరంలో పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ప్రజలందరూ సహకరించాలని కోరారు. డిసెంబరు చివరి నాటికి డంపింగ్ యార్డులో చెత్తను తొలగించి 12ఎకరాల స్థలంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. మెప్మా పీడీ విశ్వజ్యోతి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, కార్పొరేషన్ డైరెక్టర్లు పరమేశ్వర్, మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, పవన్‌కుమార్, కాశీవిశ్వేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ నరేంద్రచౌదరి, మాజీ కార్పొరేటర్లు రాజారావు, సరళ, దుర్గేష్, సింగవరం రవి పాల్గొన్నారు.

నూతన కమిటీ వర్సెస్ పూజారి

● సభ్యులకు గుడి తాళాలు ఇవ్వనని పట్టు
● పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపు



ఆలయం ఎదుట నిరసన తెలుపుతున్న నూతన కమిటీ సభ్యులు, గ్రామస్థులు

శింగనమల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పూరతన దుర్గాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీని గ్రామస్థులు ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు ఎన్నిసార్లు ఆలయ తాళాలు ఇవ్వాలని పూజారిని అడిగినా ఇవ్వలేదు. శనివారం సాయంత్రం మరోసారి తాళాలు ఇవ్వాలని కమిటీ సభ్యులు పూజారి వద్దకు వెళ్లి అడిగారు. అయితే తాళాలు ఇచ్చేది లేదని భీష్మించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి కమిటీ సభ్యులకు తాళాలు ఇవ్వాలని రెండు గంటల పాటు అడిగినా ఇచ్చేది లేదని కరాఖండిగా చెప్పాడు. బలవంతం చేస్తే పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని పెట్రోల్ డబ్బాతో బెదిరించాడు. కమిటీ సభ్యులు, పోలీసులు చేసేదేమీ లేక వెనుతిరిగారు. దీనిపై కమిటీ ఉపాధ్యక్షుడు బోయ నాగరాజు మాట్లాడుతూ ఐదేళ్లుగా ఆలయ అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. ఆలయ పూజారి వల్ల భక్తులు రావడం లేదన్నారు. సభ్యుడు పవన్‌కుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కమిటీ ద్వారా సాధ్యమవుతుందన్నారు. పూజారి సిరి మాట్లాడుతూ ఈ ఆలయం ద్వారానే కుటుంబాన్ని పోషించుకుంటున్నానన్నారు. నన్ను అధికార బలంతో బయటకి పంపేందుకు సీఐ, తహసీల్దార్ ఇతర అధికారులు బయటకు పంపేందుకు చూస్తున్నారన్నారు. ఆత్మహత్య చేసుకునేందుకైనా వెనకడానని, ఆలయాన్ని వదిలేది లేదన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు: మండల కేంద్రంలో దుర్గాంజనేయస్వామి ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం నూతన కమిటీని మార్కెట్ యార్డు చెర్మన్ దండు శ్రీనివాసులు ప్రకటించారు. అధ్యక్షులుగా బండారు లీలావతి, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, సభ్యులుగా పవన్ కూమార్, బోయ సురేష్, వీరాంజనేయులు, ఆదినారాయణ, రమణయ్య, మునేంద్ర, నరేష్, నాగరాజు, శంకర్‌నారాయణ, సత్తి ఉన్నారు.

రెవెన్యూ విభాగంలో కీలక మార్పులు

● ఆర్ఐ రజాక్‌పై బదిలీ వేటు
● ఆయన స్థానంలో కుళ్లాయప్ప నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో కీలక మార్పులు చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్ఐ అబ్దుల్‌రజాక్‌పై బదిలీ వేటు వేశారు. ఆర్ఐ అబ్దుల్‌రజాక్‌ను ఇంజనీరింగ్ విభాగంలో ఈ1 క్లర్క్‌గా బదిలీ చేయగా, అక్కడ పనిచేస్తున్న కుళ్లాయప్పను ఇక్కడికి బదిలీ చేస్తూ కమిషనర్ బాలస్వామి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ఐ చంద్రశేఖర్ స్థానంలో మరో ఆర్ఐ పెద్దక్కను, పెద్దక్క స్థానంలో చంద్రశేఖర్‌లకు స్థానచలనం కల్పించారు. రెవెన్యూ వార్డుల విభజనలో పారదర్శకత లేదనే వాదన వినిపిస్తోంది. ఆర్ఐ పెద్దక్కకు నగరంలో సుమారు 34 వార్డు సచివాలయాలు కేటాయించడం పట్ల విమర్శలు వినవస్తున్నాయి.

సామాజిక న్యాయం కోసం 18న ఆందోళనలు

అనంతపురం విద్య, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణనచేపట్టి సామాజికన్యాయం జరిగేలా చూడాలని కోరుతూ 18వతేదీన జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్లు సీపీఐజిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి తెలిపారు. ఎన్డీయే సర్కారు కేంద్రంలో అధికారంలోకి వచ్చినతర్వాతనే దళిత, గిరిజన, బడుగు వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. కులగణన చేపట్టి స్థానిక ఎన్నికలలో కులాల ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

బైకుల దొంగ అరెస్టు

అనంతపురం క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చోరీ చేసిన బైక్స్ గుజరీకి విక్రయిస్తూ ఓ దొంగ పోలీసులకు దొరికి కటకటాలపాలయ్యాడు. శనివారం కేసు, నిందితుడి వివరాలను అనంతపురం టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ మీడియాకు వెల్లడించారు. జగన్ గత నెల 7న రాత్రి 12.45 గంటలకు నగరంలోని అరవింద్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ బీసీ గర్ల్స్ హాస్టల్లో సెల్ ఫోన్స్ చోరీ చేసేందుకు వెళ్లాడు. అక్కడ సెల్‌ఫోన్లు దొరక్కపోవడంతో రాత్రి 2 గంటలకు ప్రభుత్వాసుపత్రికిలోకి వెళ్లాడు. అక్కడ చౌడేశ్వరీ ఆలయం వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు కనిపించడంతో మూడు వాహనాలను చోరీ చేశాడు. వాటిని ఆసుపత్రి వెనుకవైనున్న మిస్సమ్మ కాంపౌండ్‌లోని కంపచెట్లలో దాచేశాడు. శనివారం ఆ ద్విచక్రవాహనాలను ఒక్కోటి తీసుకొచ్చి గుజరీకి వేసి అమ్ముకోవాలని చూశాడు. సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు నిందితుడిని అరెస్టుచేసి, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టుకు హాజరుపర్చగా, న్యాయాధికారి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించడంతో పోలీసులు రెడ్డిపల్లి జైలుకు తరలించారు.

మండల కమిటీ ఎన్నిక

గార్లదిన్నె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు గ్రామంలో శనివారం రాయలసీమ రైతు వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వెంకట్రామిరెడ్డిని, అధ్యక్షుడిగా నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కొడవండ్ల ఆదినారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ తెలిపారు. సహాయ కార్యదర్శిగా మీసాల సుబ్బన్న, సుబ్బరాయుడులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎన్టీఆర్ వైద్యసేవల డీసీఓగా గంగాధర్‌రెడ్డి



అనంతపురం వైద్యం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా సమన్వయకర్త(డీసీఓ)గా డాక్టర్ గంగాధర్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేసిన డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పదవీకాలం ముగిసింది. దీంతో డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్(డీఎన్ఎంఓ)గా పనిచేస్తున్న గంగాధర్‌రెడ్డి ఎఫ్ఏసీకి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఆనంద్ ఉత్తర్వులు జారీచేశారు. కాగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌నుంచి ఫారిన్ సర్వీసుకింద వచ్చిన డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి తిరిగి తనకల్లు కమ్యునిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)కి వెళ్లనున్నారు.

బాలిక అదృశ్యం

● మూడు గంటల్లో ఛేదించిన పోలీసులు

బుక్కరాయసముద్రం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మలాటపల్లి గ్రామం ఎర్రితాత స్వామి ఆలయం వద్ద 8 ఏళ్ల బాలిక శనివారం అదృశ్యమైంది. బాలిక ఆదృశ్యం అయిన మూడు గంటల్లో పోలీసులు బాలిక ఆచూకీని కనుగొన్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు బొమ్మలాటపల్లి గ్రామం వద్ద ఉన్న ఎర్రితాత స్వామి ఆలయం వద్ద అదే గ్రామానికి చెందిన 8 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా అదే గ్రామానికి చెందిన అమర్‌నాథ్‌రెడ్డి బాలికను బైక్‌లో తీసుకెళ్లిన దృశ్యాలు నమోదు అయ్యాయి. అమర్‌నాథ్‌రెడ్డి ఆచూకీ కోసం పోలీసులు గాలించగా, ఆలయ సమీపంలో తోట వద్ద ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా బాలిక అక్కడే ఉంది. ఎందుకు తీసుకెళ్లావని అతనిని అడగ్గా మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బాలికకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. బాలికను తల్లితండ్రులకు అప్పగించి అమర్‌నాథ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

కనకదాస జయంతిని జయప్రదం చేయండి

శింగనమల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే కనకదాస జయంతిని జయప్రదం చేయాలని కురబ సంఘం మండల అధ్యక్షుడు నాగేంద్ర ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆత్మసీతరామస్వామి ఆలయంలో ఉదయం కనకదాస జయంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైసీపీ ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్‌గా చంద్రకుమార్

అనంతపురంరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ సత్యసాయి జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్‌గా జడ్పీటీసీ చంద్రకుమార్ నియమితులయ్యారు. ఆమేరకు శనివారం పార్టీ కేంద్ర పార్టీ కార్యలయం నుంచి ఎస్సీ సెల్ సభ్యుల జాబితా విడుదల చేసింది. ఇందులో కక్కలపల్లికి చెందిన చంద్రకుమార్ ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు.

జాతీయ కుస్తీ పోటీలకు లావణ్య ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుస్తీ పోటీలకు లావణ్య ఎంపికయింది. డిసెంబరు 31వతేదీ నుంచి ఢిల్లీలో జరిగే పోటీలకు పామిడికి చెందిన దాసరి లావణ్య ఎంపికైనట్లు శాప్ కోచ్ రాఘవేంద్ర తెలిపారు. లావణ్యను పామిడి ఎంఈఓ జయరామ్‌నాయక్, ప్రధానోపాధ్యాయురాలు శ్యామల, పీడీ షణ్ముఖ అభినందించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి: జేసీ



మాట్లాడుతున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ సూచించారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రజలందరూ సామాజిక బాధ్యతగా గుర్తించి పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్ పాల్గొన్నారు.

ఉద్యానవనాలను అభివృద్ధి చేయాలి

అనంతపురం క్లాక్‌టవర్(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉద్యానవనాలను ఆహ్లాదకరమైన వాతావరణ నిలయాలుగా అభివృద్ధి చేయాలని రాజీవ్ చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం స్థానిక హౌసింగ్ బోర్డులోని రాజీవ్ చిల్డ్రన్స్ పార్కులో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని స్థానికులు, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి నిర్వహించారు. హార్టికల్చర్ ఏడీ లక్ష్మయ్య, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లింగంనాయుడు, గౌరవాధ్యక్షుడు మారాల తిరుమలరెడ్డి, సభ్యులు వర్ల శంకర్, బాలాజీనాయక్, కుమారయ్య, నాగరాజు, కేశవనాయుడు, నారాయణ, అశోక్‌రెడ్డి, రమణ, లక్ష్మణ్, మురళీ పాల్గొన్నారు.



రాజీవ్ పార్కులో చెత్తను తొలగిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు, ఏఎంసీ అధికారులు



విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో చెత్తను ఊడుస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీలు

అనంతపురం విద్య (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీలు మునీర్, శ్రీనివాసులు, డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి, సూపరిండెంటెంట్స్, ఇతర సిబ్బంది పరకలు చేతపట్టుకొని ఆవరణంలో చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. డీఈఓ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు.



ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రతి గ్రామానికి తాగునీరు అందించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రానున్న మూడేళ్ల కాలంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రోడ్డు, సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని తాటిచెర్ల గ్రామంలో రూ.30లక్షలతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. ముందుగా గ్రామంలోని ప్రభుత్వం పాఠశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలసి చీపురుపట్టి రోడ్లు ఊడ్చారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చేస్తున్నామని అన్నారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో సమస్యలు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. తాము అధికారంలోకి రాగానే ప్రధాన్యతవారిగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఇటివల అనారోగ్యంతో మరణించిన లక్ష్మీకాంత్‌రెడ్డి, నారాయణరెడ్డి కుటుంబలను పరామర్శించారు. అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి చారిత్రాత్మకమైన నిర్ణయం

● దూదేకుల సంఘం నాయకుడు డాక్టర్ ఉమర్ ముక్తార్
● 24 గంటల్లో రూ.90 కోట్లు విడుదల హర్షణీయం



అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మైనార్టీల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఉమర్ ముక్తార్ అన్నారు. ఇమామ్‌లు, మౌజాన్‌ల గౌరవ వేతనాల కోసం ప్రభుత్వం రూ.90 కోట్లు విడుదల చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మైనార్టీ ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు.

బిర్సాముండా జీవితం ఆదర్శప్రాయం



బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ తదితరులు

అనంతపురంరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బిర్సాముండా జీవితం మానవాళికి ఆదర్శమని ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు అన్నారు. శనివారం వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సాముండా జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి రిజిస్ట్రార్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, పరీక్షల విభాగాధిపతి జీవీ రమణ, ఫార్మసీ ప్రిన్సిపాల్ సోమశేఖర్, పరీక్షల విభాగం కంట్రోలర్ శ్రీరాములు నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ తిమ్మప్ప హాజరయ్యారు. మొదట బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమ కన్వీనర్ లింగమయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ పేరుతో అరాచకాలు: మాజీ ఎమ్మెల్యే

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెడ్‌బుక్ పేరుతో అరాచకాలు సృష్టిస్తోందని వైసీపీ మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. శనివారం ఆయన అనంతపురంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. హిందూపురంలో వైసీపీ కార్యాలయంపై టీడీపీ గూండాలు దాడి చేశారన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసీపీ కార్యాలయంపై దాడికి సంబంధించి బాధ్యులెవరో సీసీ కెమెరాల్లో రికార్డు అయిందని తక్షణం వారిని అరెస్ట్ చేసి శిక్షించాలని పోలీస్ శాఖను కోరారు. పోలీసులు అధికార పార్టీ నేతలకు జీహుజూర్ అంటుండటం వల్లే శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు.

'అయ్యప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తాం'

అనంతపురం టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చెరువుకట్ట అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం నుంచి యథావిధిగా పూజలు చేపడతామని సాయి సేవా సమాజం ఉపాధ్యక్షుడు గజేంద్ర మోహన్ అన్నారు. శనివారం ఆలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో అయ్యప్పస్వామికి కేరళ సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించడం లేదని, స్వామివారి బంగారం కనిపించలేదని లేదని కేరళకు చెందిన నందకుమార్ ఆరోపించారన్నారు. ఆయన ఆరోపణలు చేసిన కొద్దిరోజుల్లోనే ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ బంగారం కనిపించకుండా పోవడం అవాస్తమవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మణికంఠ కేరళ వారిని పిలిపించి వారిని మభ్యపెట్టి నాగలింగారెడ్డిని అధ్యక్షుడుగా చేయాలనే ప్రయత్నం చేశారన్నారు. ఈ విషయంలో కోర్టు ఆర్డర్ ఉందని చెబుతున్నా, మణికంఠ బృందం ఒక్కరికే కోర్టు ఆర్డర్ ఎలా ఇస్తుందో స్పష్టం చేయాలన్నారు. గతంలో ఉన్న కమిటీని కొనసాగించాలా, లేక ప్రస్తుతమున్న కమిటీని కొనసాగించాలా అన్నదానిపై కోర్టు తీర్పును వెలువరించాల్సి ఉందన్నారు. ఆలయ కమిటీలో తామంతా కూడా సభ్యులుగా ఉండగా తమకు తెలియకుండా గుడిలో పూజలు చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అలాగే గుడిలో పనిచేస్తున్న పూజారికి రెండు నెలలుగా వేతనాలివ్వకపోవడంతో తామే చందాలు వేసుకుని పూజారికి ఇచ్చి, గౌరవప్రదంగా ఆయనను కేరళకు పంపుతున్నామన్నారు. ఆయన ఇంకా కేరళకు బయలుదేరకముందే మణికంఠ మరో పూజారిని ఏర్పాటు చేయడం తగదన్నారు. ఆలయ సభ్యులు బత్తల కేశవ, సాకే రామకృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

న్యాయాధికారి మంజుల


మాట్లాడుతున్న న్యాయాధికారి మంజుల

గుంతకల్లుటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుంతకల్లు జూనియర్ సివిల్ కోర్టు ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి జి. మంజుల పేర్కొన్నారు. స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం బాలల దినోత్సవం, న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువు మీద శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, న్యాయవాదులు కె. గోపాలకృష్ణ, ఎండీ బాబాతాజుద్దీన్, రమేష్, సుధాకర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తాడిపత్రి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు సమీపంలో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గండికోట కులశేఖర్ (42) అనే వ్యక్తి మృతిచెందాడని రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు.. పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లికి చెందిన కులశేఖర్ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం తాడిపత్రికి ద్విచక్రవాహనంలో వచ్చి తిరిగి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకటలక్ష్మితోపాటు కుమార్తె దివ్యజ్యోతి, కుమారుడు చరణ్ తేజ ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెట్టు మీద నుంచి పడి ఒకరు..


శ్రీనివాసులు (ఫైల్)

గుమ్మఘట్ట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం చెట్టు మీద నుంచి కింద పడి బోయ శ్రీనివాసులు(45) మృతి చెందాడు. శ్రీనివాసులు మేకల కాపరిగా అడవికి వెళ్లాడు. మేకల మేతకు చెట్టు కొమ్మలను నరికేందుకు పైకెక్కి జారి కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. సమీప కాపరులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య చంద్రమ్మ, ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారని గ్రామస్థులు తెలిపారు.

జూదరుల అరెస్ట్

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొనకొండ్ల శివారులో పేకాట స్థావరంపై శనివారం సాయంత్రం పోలీసులు దాడులు చేశారు. పేకాట 10 మంది ఆడుతుండగా 8 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద రూ.14,300 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. మరో ఇద్దరు పరారీ అయ్యారన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కేబుల్ చోరీ

యాడికి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలమడుగు గ్రామం వద్ద వ్యవసాయ బోరుబావి వైరును శుక్రవారం రాత్రి దొంగలు కత్తిరించుకు వెళ్లారని రైతు గోపాల్ తెలిపారు. రాయలచెరువు గ్రామానికి చెందిన రైతు గోపాల్‌కు దైవాలమడుగు వద్ద నిమ్మతోట ఉంది. శుక్రవారం రాత్రి దొంగలు వ్యవసాయ బోరుబావి కేబుల్‌వైర్ కత్తిరించుకు వెళ్లినట్లు తెలిపాడు. 40మీటర్ల కేబుల్‌వైరును దొంగలు ఎత్తుకెళ్లారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దీని విలువ రూ.10వేలు ఉంటుందని తెలిపాడు.

సబ్సిడీ కావాలంటే ఈకేవైసీ తప్పనిసరి

బొమ్మనహాళ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎల్పీజీ గ్యాస్ సబ్సిడీలు కొనసాగాలంటే వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాల్సిందే అని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సాయిసుధీర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సబ్సిడీలు ఈకేవైసీ ఆధారంగానే జమఅవుతుందన్నందున గ్యాస్ కనెక్షన్ పొందిన వారు ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆదివారం మండలంలోని దేవగిరి, బండూరు గ్రామాల గ్యాస్ వినియోగదారులకు ప్రత్యేక ఈకేవైసీ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

18 నుంచి స్వచ్ఛ పంచాయతీపై శిక్షణ

రాయదుర్గంరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛ గ్రామపంచాయతీపై మూడురోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండన్న శనివారం తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనే అంశంపై ఈ నెల 18, 19, 21 తేదీలలో శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. 18వ తేదీన పంచాయతీ కార్యదర్శులకు, ఉప సర్పంచులకు 19వ తేదీన మహిళా సంఘాల లీడర్లకు 21వ తేదీన గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

వేతనాల విడుదలపై ఇమామ్‌ల హర్షం

గుంతకల్లుటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గౌరవ వేతనాలు చెల్లించడంపై ఇమామ్‌లు, మౌజన్లు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎస్‌జేపీ హైస్కూల్ వద్ద ఉన్న ఈద్గా ఫంక్షన్ హాలులో శనివారం ముఖ్యమంత్రికి గుంతకల్లు ఇమామ్, మౌజన్లు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ రజాక్‌పీర్, ఇమామ్, మౌజన్లు,టీడీపీ మైనార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖాజీ మాట్లాడుతూ.. 11 నెలల నుంచి ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం పెండింగ్‌లో ఉండేదన్నారు. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను సీఎం విడుదల చేశారని ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబునాయుడు ఆరోగ్యంగా ఉండాలని దువా చేశారు. కార్యక్రమంలో నాయకులు సద్దాం హుసేన్, ఫజులు, మహ్మద్‌ఖాజా, మస్తాన్, వలీబాషా, షంషుద్దీన్, ఆటో ఖాజా, సమీర్, సీఎం ఫిరోజ్, అల్లాబకాష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ ఖాజీ

ఎంపీడీఓ కార్యాలయానికి ఇద్దరే దిక్కు..!

● ఏడు పోస్టులు ఖాళీ..
● ఎంపీడీఓ, జూనియర్ అసిస్టెంట్‌పైనే పాలనా భారం

బొమ్మనహాళ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సిబ్బంది, జనంతో రద్దీగా ఉండే మండల పరిషత్ కార్యాలయం.. నేడు బోసిపోతోంది. తొమ్మిది పోస్టులలో ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎంపీడీవో విజయభాస్కర్, జూనియర్ అసిస్టెంట్ గౌరీశంకర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మండల పరిషత్ పరిపాలనను ఈ ఇద్దరే చూస్తున్నారు. వరుసగా అధికారుల బదిలీల జరిగిపోయాయి. వారి స్థానాల్లో కొత్తవారిని నియమించకపోవడంతో కార్యాలయం మొత్తం ఆగిపోయినట్లయింది. మండల పరిషత్ కార్యాలయం పరిస్థితి చూడగానే ఎవరైనా ఆశ్చర్యపోతారు. రోజూ రద్దీగా పని చేసే కార్యాలయం ఇప్పుడు పోస్టుల కొరతతో నిశ్శబ్దంగా, నిర్వీర్యంగా కనిపిస్తోంది. ప్రజలు ఉదయం నుంచే పనుల కోసం వస్తుంటారు. కానీ ఫైళ్లు కదలవు.. పనులు ముందుకు సాగవు. ఎందుకంటే కార్యాలయంలో పనిచేసే వారు ఇద్దరే.. ఎంపీడీఓ, జూనియర్ అసిస్టెంట్ తప్ప అక్కడ ఇంకెవరూ లేరు. ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ, ఏఓ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, అటెండర్ పోస్టులు మూడు.. ఈ అధిక బాధ్యతలన్నీ ఇప్పుడు ఇద్దరిపైనే పడ్డాయి. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ వీరాంజనేయులు అనంతపురం డీపీఆర్సీ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఇటీవల సీనియర్ అసిస్టెంట్ హనుమంతప్ప ఏఓగా ఉద్యోగోన్నతిపై గుమ్మగట్టకు బదిలీ అయ్యారు. డిప్యూటీ ఎంపీడీఓ దేవదాస్ కూడా ఉద్యోగోన్నతిపై ఎంపీడీఓగా గుంతకల్లుకు వెళ్లిపోవడంతో మండల కార్యాలయం ఖాళీగా ఉంది. టైపిస్ట్ రాఘవ గత ఏడాది డి. హీరేహాళ్‌కు బదిలీ అయ్యారు. అటెండర్ పోస్టులు మూడు చాలా కాలంగా ఖాళీగానే ఉన్నాయి. ఈ ఖాళీ చేసిన స్థానాల్లో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కార్యాలయంలో ఫైళ్లు పేరుకుపోయి పర్వతాల్లా కనిపిస్తున్నాయి. అభివృద్ధి పనులు, అనుసంధాన కార్యక్రమాలు, గ్రామాల నుంచి వచ్చే పథకాల ప్రతిపాదనలు అన్ని పెండింగ్‌లో పడి ఉన్నాయి. నిత్యం వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బొమ్మనహాళ్ మండల పరిషత్ కార్యాలయానికి తగిన సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.



బొమ్మనహాళ్ మండల పరిషత్ కార్యాలయం

ప్రజా సేవలు ఆగిపోకుండా చూస్తున్నాం



మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది కొరత నిజమే. డిప్యూటేషన్లు, ఉద్యోగోన్నతులు వరుసగా జరిగిపోవడంతో ప్రస్తుతం నాతో పాటు జూనియర్ అసిస్టెంట్ మాత్రమే పని చేస్తున్నాం. అయినప్పటికి ప్రజా సేవలు ఒక్కరోజు ఆగిపోకుండా ప్రయత్నిస్తున్నాం. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే సిబ్బందిని నియమించాల్సిందిగా సీఈఓ కార్యాలయానికి కూడా ప్రతిపాదనలు పంపాం. మా పరిధిలో ఉండే ప్రతి పనిని వేగంగా పూర్తి చేసే ప్రయత్నం చేస్తున్నాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పరిపాలనను సాధ్యమైనంత సమర్థంగా నడుపుతున్నాం.

- విజయభాస్కర్, ఎంపీడీఓ, బొమ్మనహాళ్

వైభవంగా అంజన్న పూల రథోత్సవం

బొమ్మనహాళ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) మండలంలోని నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి పూల రథోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం చివరి శనివారం సందర్భంగా పూల రథోత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌చార్యులు ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. మూలవిరాట్‌కు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు. రాత్రి 7 గంటలకు కార్తీక దీపం పెట్టి పూల రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త ఎన్సీ శ్రీనాథ్, మాజీ ధర్మకర్తలు శాంతయ్య, వన్నూరుస్వామి, టీడీపీ నాయకులు గాలి బసప్ప, బెళ్లి హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



అలంకరణలో ఆంజనేయస్వామి, జనసందోహం మధ్య పూల రథోత్సవం

వైభవంగా పల్లకి సేవ


ఉత్సవమూర్తుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, ఆలయ అధికారులు

ఉరవకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, పల్లకిలో కొలువుదీర్చారు. అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్తీకమాసం కావడంతో పెన్నానదిలో భక్తులు స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏసీ, ఇన్‌చార్జీ ఈవో తిరుమలరెడ్డి, అర్చకులు ద్వారకనాథాచార్యులు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

గుత్తిరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బేదొడ్డి గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, రత్నమ్మ అనే దంపతులు బైక్‌పై అబ్బేదొడ్డికి బయలుదేరారు. గ్రామ శివారులోకి రాగానే ముందు వెళ్తున్న కారు ఒకసారిగా నిలబడడంతో బైక్ కారుని ఢీ కొట్టింది. దీంతో చంద్రశేఖర్ రెడ్డి, రత్నమ్మ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చంద్రశేఖర్ రెడ్డిని అనంతపురానికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో నలుగురి అరెస్ట్

పుట్లూరు, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్లూరు- మడ్డిపల్లి గ్రామాల మధ్య గతనెల 23న యల్లనూరు మండలం కూచివారిపల్లికి చెందిన జయకృష్ణ అనే వ్యక్తిపై బొప్పేపల్లికి చెందిన చైతన్య, రవికుమార్, సుధాకర్, కరుణాకర్ దాడిచేసిన ఘటనలో శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ సత్యబాబు తెలిపారు. జూలైలో జరిగిన పీర్ల పండుగలో గొడవ పడ్డారన్నారు. వీటిని మనసులో పెట్టుకున్న ఆ వ్యక్తులు గతనెల 23న జయకృష్ణ బైక్‌పై ఇంటికి వెళుతుండగా నలుగురు బైక్‌లతో వెంబడించి రాళ్లతో దాడిచేశాన్నారు. ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేసి అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు దర్యాప్తు చేశారన్నారు. నిందితులను బుక్కరాయసముద్రం దగ్గర అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

గుత్తిరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని టి. కొత్తపల్లికి చెందిన వరలక్ష్మి అనే మహిళ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గ్రామానికి చెందిన వరలక్ష్మి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేదని పోలీసులు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉన్న ఆమెను బంధువులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన


పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

తాడిపత్రి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించినట్లు అధికారి రవికుమార్‌నాయుడు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులకు సంబంధించిన పుస్తకాలు, వైజ్ఞానిక, వినోద, కవితలు- కథల పుస్తకాలు ప్రదర్శించామని అన్నారు.

● గుత్తి: పట్టణంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ.. విద్యార్థులు, మహిళలు, ప్రజలు పుస్తకాలను పఠించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు.

● యాడికి : పుస్తకాలు విద్యార్థులకు మంచి నేస్తాలు అని యాడికి గ్రంథాలయాధికారి మధుసూదన్ తెలిపారు. జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలను పురస్కరించుకొని యాడికి గ్రంథాలయం వద్ద పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధిపై అవగాహన

రాయదుర్గంరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించినట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సునీల్‌కన్న పేర్కొన్నారు. స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అప్లికేషన్స్ కంప్యూటర్ సైన్స్ వి భాగం సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో కేరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పరీసా ఫిర్దోష్, అమీర్ హుస్సేన్, పాత్రరాజు తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి

యాడికి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ బిల్డింగ్, ఇతర నిర్మాణాల ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతరెడ్డి తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం యాడికిలో విడుదలచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బషీర్‌అహమ్మద్, మోహన్, పెద్దన్న, మహాలక్ష్మి పాల్గొన్నారు.

నిజవల్లిలో ఘనంగా వాల్మీకి జయంతి

కుందుర్పి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నిజవల్లిలో శనివారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటాన్ని పూర్ణకుంభాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వాల్మీకి కుల పెద్దలు మాట్లాడుతూ.. ఆర్థికంగా, రాజకీయంగా బలపడాలంటే మన పిల్లలకు మంచి చదువులు అందించినప్పుడే అవన్నీ సాధ్యమవుతాయన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజా ఆరోగ్యం

పలు మండలాల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

గుత్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా తెలిపారు. గుత్తి ఆర్ఎస్‌లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సభను ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ తమ పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యాలను కాపాడుకోగలమని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజరు రాంబాబు, కరస్పాండెంట్ యేగేంద్ర, మెప్మా టీఎంసీ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● కళ్యాణదుర్గంరూరల్ : వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక పరిశుభ్రత ప్రతి ఒక్కరు అలవరుచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు. పట్టణంలోని కోటవీధిలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రపై అవగాహన కల్పించారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేయడం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కోనంకి శ్రీధర్, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

● బెళుగుప్ప: పరిసరాల వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం సాధ్యమవుతుందని డీఎల్‌డీవో నాగేశ్వరరావు తెలిపారు. బెళుగుప్ప లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు. కార్య క్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఏఓ క్రిష్ణనాయక్, హెచ్ఎం వెంకట ప్రసాద్, ఈవోఆర్డీ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

● బొమ్మనహాళ్: గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత పాటిస్తే గ్రామం ఆరోగ్యంగా ఉంటుందని తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్ అన్నారు. మండల కేంద్రమైన బొమ్మనహాళ్ తోపాటు, ఉప్పరహాళ్, శ్రీధరఘట్ట తదితరగ్రామాల్లో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఎర్రిస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీత, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● విడపనకల్లు: మండల కేంద్రంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రాపై మండల అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్‌లో మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛత, పరిశుభ్రత వల్ల కలిగే లాభాలు వివరించారు.

● రాయదుర్గంరూరల్ : స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా వ్యక్తిగత సామూహిక పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారి యశోదబాయ్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సునీల్ కన్న పేర్కొన్నారు. నగరవనంలో కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కాండిడేట్లు విభాగల ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు గురుప్రభాకర్, రామచంద్రుడు, దామోదర్‌రెడ్డి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దపప్పూరు : మండల కేంద్రంలో ఎంపీడీఓ రత్నబాయ్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీఓ సురేష్‌బాబు, ఎంఈఓ ఓబులపతి పాల్గొన్నారు.




గుత్తిలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్, కళ్యాణదుర్గంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్..

13న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న న్యాయాధికారులు బి. శ్వేత, కాశీ విశ్వనాథాచారి

గుత్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల న్యాయసేవా సమితి చైర్మన్ సాధుబాబు ఆదేశాల మేరకు డిసెంబరు 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కాశీవిశ్వనాథాచారి, జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి బి.శ్వేత తెలిపారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని కోర్టు హాల్‌లో జాతీయ లోక్‌అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీ అయిన కేసులను పెద్ద సంఖ్యలో పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. డిసెంబరు 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీడీ రత్నం, ఎక్సైజ్ సీఐ ఉమాదేవి, ఏజీపీ ఫక్రుబాషా, సీనియర్ న్యాయవాదులు చలపతి, సతీష్, గంగాధర్, వివిధ బ్యాంక్ మేనేజర్లు, గుత్తి, పామిడి, పెద్దవడుగూరు సీఐ, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

సీఐ సతీష్ మరణానికి కారకులను శిక్షించాలి

బొమ్మనహాళ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రైల్వే సీఐ సతీష్ మరణానికి కారకులను కఠినంగా శిక్షించాలని కుమ్మరి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మాజీ జడ్పీటీసీ, టీడీపీ నాయకులు కుమ్మరి మల్లికార్జున, కుమ్మరి సంఘం నాయకులు వన్నూరుప్ప, రామాంజనేయులు, శీనా, గోపాల్ విలేకరులతో మాట్లాడుతూ.. నిజాయితీ గల అధికారి మరణానికి గురి చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టొద్దు అని డిమాండ్ చేశారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితను కలుస్తామని చెప్పారు. సీఐ సతీష్ వంటి నిజాయితీ, ధైర్యవంతుడైన అధికారిని కోల్పోవడం దురదృష్టకరం అని అన్నారు. కేసును త్వరగా ఛేదించి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా చల్లా సుబ్బరాయుడు జయంతి


నివాళులు అర్పిస్తున్న నాయకులు

తాడిపత్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యల్లనూరురోడ్డు సర్కిల్‌లో మాజీ మంత్రి చల్లా సుబ్బరాయుడు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జంబులపాడుకు చెందిన ప్రభాకర్‌నాయుడు, చింబిలి వెంకటరమణ మాట్లాడుతూ.. చల్లా సుబ్బరాయుడు తాడిపత్రి అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రంగప్రసాద్, జనార్ధన్‌నాయుడు, రవి, వెంకటనాయుడు, ప్రసాద్, ముసలయ్య, రాము, నాగభూషణ పాల్గొన్నారు.

రోటరీక్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శి ఎన్నిక

తాడిపత్రి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి రోటరీక్లబ్ 2026-27కు సంబంధించి నూతన అధ్యక్షుడిగా మహమ్మద్‌రఫీ, కార్యదర్శిగా భరత్‌ను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. శనివారం స్థానిక క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో వీరిని ఎన్నుకున్నట్లు వివరించారు.ఎన్నికైన వారు 2026 జూలై నుంచి ఏడాదిపాటు సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో సభ్యులు కిషోర్, నవీన్, మురుగన్ బాలు, అబ్దుల్‌రహీం, మద్దిలేటి, సంజన్న పాల్గొన్నారు.

ఈ పంట నమోదు జాబితా విడుదల

కూడేరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ- పంటలో నమోదు చేశామని, రైతు సేవా కేంద్రాల్లో జాబితా విడుదల చేసినట్లు ఏవో శుభకర్ పేర్కొన్నారు. శనివారం కూడేరు మండలం గొట్కూరు గ్రామ రైతు సేవా కేంద్రంలో ఈ పంట జాబితాను ప్రదర్శించారు. పంటలు సాగు చేసి జాబితాలో పేర్లు లేకపోతే తక్షణం సోమవారం కూడేరులో జరిగే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

● విడపనకల్లు : మండలంలోని ఈ క్రాప్ నమోదు చేసిన జాబితాను శనివారం విడదల చేశారు. చీకలగురకి గ్రామంలోని సచివాలయంలో ఏఓ హెచ్ పెన్నయ్య జాబితాను నోటీస్ బోర్డులో ప్రదర్శనగా ఉంచారు.

ఇద్దరు మట్కా బీటర్ల అరెస్ట్

గుత్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం మట్కా స్థావరాలపై సీఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్ బాబు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఎస్సీ కాలనీలో మట్కా నిర్వహిస్తున్న నగదాని శివ, శివసాగర్ వెనుక కాలనీలో ముబారక్ అనే మట్కా బీటర్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 62,200, మట్కా చీటీలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఏఎస్ఐలు రామాంజనేయులు, నాగమాణిక్యం, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కుందుర్పి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అపిలేపల్లికి చెందిన బొమ్మలాట హనుమంతరాయుడుకు రూ. 60 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం స్థానిక నాయకులు అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన హనుమంతరాయుడుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 60 వేలు మంజూరు కాగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాలతో బాధితుల ఇంటి వద్దకు వెళ్లి చెక్కును గ్రామ కమిటీ అధ్యక్షుడు ఈరన్న, మాజీ మండల కన్వీనర్ కర్తనపర్తి రామాంజినేయులు అందజేశారు.

గ్రామ పంచాయతీ భవనానికి స్థలం వితరణ

బెళుగుప్ప, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆవులెన్న గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి నాలుగు సెంట్ల స్థలాన్ని మాజీ సర్పంచ్ శివయ్య కుమారుడు డాక్టర్ శ్రావణ్ కుమార్ ఉచితంగా కేటాయించినట్లు సర్పంచ్ రామమోహన్ శనివారం తెలిపారు. పాత భవనం శిథిలావస్థలో వుండటంతో ప్రభుత్వం రూ. 32 లక్షలు మంజూరు చేసిందని పంచాయతీరాజ్ ఇంజనీర్ పరశురాం తెలిపారు. స్థలం లేక ఇబ్బంది పడుతుండగా గ్రామస్థులు శ్రావణ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన నాలుగు సెంట్లు ఉచితంగా ఇచ్చారు. గ్రామస్థులు, టీడీపీ నాయకులు వెంకటస్వామి, యర్రిస్వామి, మనోహర్, అంజి స్థల దాతను అభినందించారు.

రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2780 క్యూసెక్కులు

బెళుగుప్ప, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2,780 క్యూసెక్కులు ఉన్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు వెల్లడించారు. ఔట్‌ఫ్లో 2,780 క్యూసెక్కులు వుండగా ప్రస్తుతం 1.732 టీఎంసీల నీటి నిల్వ వుందన్నారు. ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1858 క్యూసెక్కులు వెళుతుందని అధికారులు వెల్లడించారు.

ఆక్రమణలను తొలగించాలి

ఉరవకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన బంకులను తొలగించాలని వార్డు సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచు లలితమ్మ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాన్ని అరగంటలోపే ముగించి, మమ అనిపించారు. ఇంటి నిర్మాణాలకు సంబంధించి అహుడా అనుమతులు ఇస్తుందని కార్యదర్శి తెలిపారు. పంచాయతీ క్వార్టర్స్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. గవిమఠం ఆవరణంలో మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో తెలిపారు. జీతాలు పెంచాలని కార్మికులు వినతి పత్రాన్ని అందజేశారు.